# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 12.05.2025 | 24 క్యారెట్లు 89,215.00 | కిలో వెండి 1,07,880.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:191

www.vishalabharati.com




## భారత ఆర్మీ కమాండర్లకు పూర్తి అధికారాలు

- పాక్ బుల్లెట్లకు ఫిరంగులతో సమాధానం ఇవ్వాలి
- పాకిస్తాన్ ప్రతి చర్యకు బలమైన ప్రతిస్పందన ఉండాలి
- కశ్మీర్ విషయంలో భారత్‌కు చాలా స్పష్టమైన వైఖరి ఉంది
- ప్రధాని నరేంద్ర మోదీ సూచన

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పాకిస్థాన్ బుల్లెట్లకు ఫిరంగులతో సమాధానం ఇవ్వాలని భారత సైన్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. పాకిస్థాన్ ప్రతీ చర్యకు భారత్ నుంచి బలమైన ప్రతిస్పందన ఉండాలని సాయుధ దళాలకు సూచించారు. కశ్మీర్ విషయంలో భారత్‌కు చాలా స్పష్టమైన వైఖరి ఉందని మోదీ వెల్లడించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా కశ్మీర్ అంశంలో పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చి చెప్పాయి. అంతే కాకుండా పాకిస్థాన్పై దాడి చేస్తామని ముందే అమెరికాకు భారత్ చెప్పినట్లు పేర్కొన్నాయి.

**అమెరికాకు ముందే సమాచారమిచ్చిన జైశంకర్**

పాకిస్థాన్లోని ఉగ్రవాదులపై దాడి చేసి తీరుతామని, దానిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని మే 1న

..మిగతా 2 లో



మిలిటెంట్లు అంతమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్

# 100 మంది ఉగ్రవాదులు హతం

పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు బలమైన సమాధానం చెప్పాలన్నదే

ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని సైన్యం తెలిపింది. సరిహద్దు ఆవల ఉన్న ఉగ్రవాద శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించి స్పష్టమైన ఆధారాలతో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించామని డీజీఎంవో లెఫ్టినెంట్ జెనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు మరణించారని చెప్పారు.

- పాకిస్తాన్ సైన్యం సైతం విఫలయత్నాలు చేసింది
- వెల్లడించిన భారత సైన్యం
- ఉగ్రవాదులకు బలమైన సమాధానం చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం
- పౌరులపై దాడులకు పాకిస్థాన్ తగిన ప్రతిఫలం చెల్లించింది
- ఆపరేషన్ కు సంబంధించి త్రివిధ దళాల అధికారులు మీడియా సమావేశం

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

సాయంత్రం సైన్యం ప్రెస్ మీట్ నిర్వహించగా, ఇందులో రాజీవ్‌ఘాయ్‌తో పాటు ఎయిర్ మార్షల్ ఏకే భారతి, వైస్ అడ్మిరల్ ప్రమోద్ పాల్గొన్నారు. పాకిస్థాన్ భూభాగంపై చేసిన దాడులను వీడియోలు, షాటిలైట్ చిత్రాలతో సహా వెల్లడించారు. పౌరులపై దాడులకు పాకిస్థాన్ తగిన ప్రతిఫలం చెల్లించిందని డీజీఎంవో తెలిపారు. భారత్‌లోని అనేక సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడానికి పాకిస్థాన్ సైన్యం విఫల యత్నాలు చేసిందని, వాటిని తిప్పికొట్టినట్లు ఘాయ్ తెలిపారు. భారత్ కాల్పుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయారని వెల్లడించారు. బహావల్‌పూర్, మురుద్కే ఉగ్రస్థావరాలపై భారత వైమానికదళం కచ్చితమైన దాడులు చేసినట్లు ఎయిర్ మార్షల్ ఏకే భారతి తెలిపారు. దాడులకు ముందు ఆ తర్వాత ఘటనాస్థలి దృశ్యాలను ఏకే భారతి తెరపై ప్రదర్శిస్తూ వివరించారు. పాక్ గుంపులుగా డ్రోన్ల దాడికి పాల్పడిందని, తక్షణమే భారత్ వాటిని సరిహద్దు ఆవలే భారత్ ధ్వంసం చేసిందని

..మిగతా 2 లో

## ఆపరేషన్ సిందూర్ తో.. పాకిస్తాన్ వణికింది

- ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకున్న దృఢసంకల్పం
- పాక్ సైనిక ప్రధాన కార్యాలయం వరకూ భారత సైన్యం ప్రతిధ్వని వినిపించింది
- రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా రావల్పిండిలోని పాక్ సైనిక ప్రధాన కార్యాలయం వరకూ భారత సైన్యం ప్రతిధ్వని వినిపించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకున్న దృఢసంకల్పం, సైనిక శక్తికి నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు భారతమాత కిరీటంపై దాడిచేసి, అనేక కుటుంబాల నుంచి సిందూర్ తుడిచి పెట్టిన భారత వ్యతిరేక, ఉగ్రవాద సంస్థపై భారత సాయుధ దళాలు

..మిగతా 2 లో



## ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

విశాలభారతి, స్టేట్ బ్యూరో;

తెలంగాణ ఎప్‌సెట్ 2025 ఫలితాలు ఆదివారం ఉదయం 11 గంటలకు విడుదల అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన


..మిగతా 2 లో

## ఇందిరా గాంధీ తప్పిదంతోనే ఈశాన్య అశాంతి

- చారిత్రక తప్పిదాల దుష్ఫలితాలను అనుభవిస్తున్నాం
- సిఎం హిమంత బిస్వా శర్మ

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన చారిత్రక తప్పిదాల దుష్ఫలితాలను మనం ఇప్పుడు అనుభవిస్తున్నామని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ విమర్శించారు. పాకిస్థాన్‌ను 1971 యుద్ధంలో చిత్తుగా ఓడించడం చారిత్రాత్మక పరిణామం అయింది. ఈ దశలో బంగ్లాదేశ్ ఏర్పడింది. అప్పట్లో భారత్‌కు అనేక సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే



అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పరిస్థితిని దుర్వినియోగపర్చారని, సరైన విధంగా నిర్వహించలేకపోయారని విమర్శించారు. దీనితో ఇప్పుడు మనం ప్రత్యేకించి

..మిగతా 2 లో

## అబద్ధాల కాంగ్రెస్


- సీతారామ ప్రాజెక్టుపై అసత్య ప్రచారం
- తాగునీటి కోసం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం
- మా హయాంలో ఆ ప్రాజెక్టుకు 90 శాతం పనులను పూర్తి చేశాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు కూడా అదే అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల పై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన



..మిగతా 2 లో



## స్పెయిన్‌లో డ్రగ్స్ అలవాటు పడ్డాను

- ఇండియాలో కొనసాగించాను
- నెలకోసారి డ్రగ్స్ కొంటారు.
- ఫ్రెండ్ బాయ్‌ఫ్రెండ్ ద్వారా డ్రగ్స్ కింగ్‌పిన్ వన్ష్ థక్కర్ పరిచయం
- కొకెయిన్‌తో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన డాక్టర్ వెల్లడి


2 లో

## మే 13 పాలిటెక్నిక్ పరీక్ష

- రాష్ట్రవ్యాప్తంగా 276 పరీక్షా కేంద్రాలు
- 1,06,716 మంది విద్యార్థుల దరఖాస్తు
- ఒక గంట ముందే పరీక్షా కేంద్రంలోకి
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు

విశాలభారతి, స్టేట్ బ్యూరో :

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం(మే 13) పాలిటెక్నిక్ పరీక్ష నిర్వహించనున్నా



రు. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 276 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ తెలిపారు. పాలిసెట్ 2025కు రాష్ట్రవ్యాప్తంగా 1,06,716మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల

..మిగతా 2 లో

## యుద్ధం వద్దంటే దేశద్రోహులా?




- యుద్ధానికి సై అన్నవాళ్లు ఇప్పుడు వద్దని ఒడంబడిక
- అమెరికా అధ్యక్షుని అబద్ధపు ప్రకటనను ఖండించలేని మోదీ
- ప్రపంచ దేశాలపై అమెరికా పన్నుల దాడి
- భారత రైతాంగాన్ని దివాలా తీయించే చర్యలు తిప్పికొట్టాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

యుద్ధం వద్దన్నందుకు కొందరు.. కమ్యూనిస్టులను దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు యత్నించారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. చివరకు యుద్ధానికి పురిగొల్పిన వాళ్లే వద్దని ఒడంబడిక చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దేశానికి ఏది మంచో.. ఏది చెడో.. చెప్పగలిగేది కమ్యూనిస్టులని అన్నారు. పార్టీ విచ్ఛిన్నమైన ప్రాంతంలో ఏటికి ఎదురొడ్డి పోరాడిన

..మిగతా 2 లో



## బిల్‌గేట్స్ రూ.9 లక్షల కోట్లు దానం

- గేట్స్ ఫౌండేషన్ ద్వారా భారీగా సంక్షేమ కార్యక్రమాలు
- 2045 వరకు విస్తృతంగా సేవలు
- ఆపై సంస్థను శాశ్వతంగా మూసివేయాలని యోచన

2 లో



# ఎస్ఎన్ మెడికల్ షాప్ ప్రారంభం

- పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: హయత్ నగర్ లోని ఉషోదయ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్ ఎన్ మెడికల్ షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ బండారి భాస్కర్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ , డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్ , నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ మెడికల్ షాప్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# బిల్‌గేట్స్ రూ.9 లక్షల కోట్లు దానం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. తన సంపదంలో 99 శాతాన్ని గేట్స్ ఫౌండేషన్‌కు దానం చేయబోతున్నట్టు ప్రకటించారు. ఆ సంపదతో గేట్స్ ఫౌండేషన్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను భారీ స్థాయిలో చేపట్టనున్నారు. 2045 నాటికి ఆ సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి గేట్స్ ఫౌండేషన్‌ను పూర్తిగా మూసెయ్యాలని నిర్ణయించుకున్నారు.ప్రస్తుత లెక్కల ప్రకారం బిల్‌గేట్స్ సంపదలో 99 శాతం అంటే 107 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీ ప్రకారం 9 లక్షల కోట్ల రూపాయలు. అలాగే దాతల నుంచి విరాళాలు కూడా సేకరించి రాబోయే 20 ఏళ్లలో మరో 200 బిలియన్ డాలర్లు (రూ.16 లక్షల కోట్ల రూపాయలకు పైగా)ను కూడా ఖర్చుపెట్టబోతున్నారు. ఈ డబ్బును పూర్తిగా ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన వంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించి, ఆపై సంస్థను శాశ్వతంగా మూసివేయాలని యోచిస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్‌కు ప్రపంచ కుభేరుడు అయిన వారెన్ బఫెట్ కూడా భారీగా విరాళాలు అందజేస్తుంటారు. కాగా, ప్రపంచంలో అత్యంత ధనవంతుడు, టెస్లా అధినేత ఎలన్ మస్క్ పై ఇటీవల బిల్‌గేట్స్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అమెరికా పలు పేద దేశాలకు అందించే సహాయంలో మస్క్ కోత విధించిన సంగతి తెలిసిందే. ఎలన్ మస్క్ నిర్ణయం వల్ల పేద దేశాల్లో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతోందని బిల్‌గేట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, గేట్స్ ఫౌండేషన్‌ను బిల్‌గేట్స్, మిలిందా 2000 సంవత్సరంలో స్థాపించారు. గేట్స్ ఫౌండేషన్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఛారిటబుల్ ట్రస్ట్.

# ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

తరువాయి భాగం

నివాసంలో ఈ మేరకు ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు సాధించిన ర్యాంకులు మార్కుల జాబితాను కూడా వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల ప్రిలిమినరీకీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన విషయం తెలిసిందే. మొత్తంగా దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు ఎప్‌సెట్‌కు హాజరయ్యారు. టీజీ ఈఏపీసెట్ ఫలితాలతో పాటు తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సిలింగ్ తేదీలను కూడా ప్రకటించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు ఫలితాలు చెక్ చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్ https://eapcet.tgche.ac.in/ చూడొచ్చు. విద్యార్థులు ఈఏపీసెట్ హాల్ టికెట్ నెంబర్, రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు ఎంటర్ చేయడంతో విద్యార్జులు ఫలితాలను సెల్‌ఫోన్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగం, అగ్రికల్చర్ ఫార్మా విభాగం ఆన్సర్ కీ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో సంబంధం ఉన్న అధికారులు పాల్గొన్నారు.

**ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో టాప్-10 ర్యాంకులు..**

1. పల్లా భరత్ చంద్ర మన్యం జిల్లా కొమరాడ (ఏపీ)
2. ఉదగండ్ల రామచరణ్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మాదాపూర్
3. పమ్మిన హేమసాయి సూర్యకార్తీక్ విజయనగరం జిల్లా
4. మెండె లక్ష్మీభార్గవ్ నాచారం
5. వెంకట గణేశ్ రాయల్ మాదాపూర్
6. సుంకర సాయి రిశాంత్‌రెడ్డి మాదాపూర్
7. రష్మిత్ బండారి మాదాపూర్
8. బనిబ్రత మాజీ బండగ్‌పేట
9. కొత్త ధనుష్ రెడ్డి నార్సింగి, రంగారెడ్డి
10. కొమ్మ శ్రీకార్తీక్ మేడ్చల్

**అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో..**

1. పెద్దక్కగారి సాకేత్‌రెడ్డి నిజాంపేట, మేడ్చల్
2. సబ్బాని లలిత్ వరేణ్య కరీంనగర్
3. చాడా అక్షిత్ వరంగల్
4. పెద్దింటి రాచర్ల సాయినాథ్ కొత్తకోట
5. బ్రాహ్మణి మాదాపూర్
6. గుమ్మడిదల తేజస్ కూకట్‌పల్లి
7. అఖిరానంద్‌రెడ్డి నిజాంపేట
8. భానుప్రకాశ్‌రెడ్డి సరూర్‌నగర్
9. శామ్యూల్ సాత్విక్ హైదర్‌గూడ
10. అద్దుల శశికిరణ్‌రెడ్డి బాలాపూర్

# భారత ఆర్మీ కమాండర్లకు పూర్తి అధికారాలు

తరువాయి భాగం

అమెరికా విదేశాంగ మార్కో రూబియోకు భారత విదేశాంగ మంత్రి జై శంకర్ చెప్పినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 'ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులతో పాకిస్తాన్‌కు ఉన్న లింకులపై సరికొత్త ఆధారాలతో ఒక టీమ్‌ను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి భారత్ పంపనుంది. వచ్చే వారం యూఎన్ఎస్‌సీఆర్ 1267 ఆంక్షల కమిటీ సమావేశమై ఈ ఆధారాలను పరిశీలించనుంది' అని భారత ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి.భారత సైనిక వర్గాల కథనం ప్రకారం మే 9న రాత్రి, మే 10న తెల్లవారుజామున పాకిస్థాన్లోని సైనిక స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసింది. అనంతరం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రంగంలోకి దిగి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు కాల్ చేసి మాట్లాడారు. అనంతరం భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు రూబియో ఫోన్ చేశారు. భారత్‌తో చర్చలకు పాకిస్తాన్ సిద్ధంగా ఉందని జైశంకర్‌కు రూబియో సమాచారం ఇచ్చారు. కేవలం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల స్థాయిలో చర్చలు జరుగుతాయని భారత్ స్పష్టం చేసింది. తదుపరిగా మే 10న మధ్యాహ్నం 1 గంటలకు ఫోన్ కాల్ చేయడానికి భారత డీజీఎంఓను పాకిస్థాన్ డీజీఎంఓ అపాయింట్‌మెంట్ కోరారు. తదుపరిగా ఇరుదేశాల డీజీఎంఓలు చర్చించుకొని కాల్పుల విరమణపై అంగీకారానికి వచ్చారు. వాస్తవానికి మే 7నే 'ఆపరేషన్ సిందూర్'ను పూర్తి చేశాక, పాక్ డీజీఎంఓకు భారత డీజీఎంఓ ఒక మెసేజ్‌ను పంపారు. అయితే ఆ రోజున పాక్ డీజీఎంఓ నుంచి స్పందన రాకపోవడం గమనార్హం.పపాకిస్థాన్‌పై మూడ్రోజుల సైనిక చర్య తర్వాత పరిస్థితులు సంపూర్ణంగా మారిపోయాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచం, పాకిస్థాన్ దీన్ని అంగీకరించాలని, పరిస్థితులు గతంలో మాదిరిగా ఉండవని తెలిపాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం, 12.05.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com





## మే 13 పాలిటెక్నిక్ పరీక్ష

తరువాయి భాగం: నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలిసెట్ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి ఒక గంట ముందుగానే అంటే ఉదయం 10 గంటలకే అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంల్లోకి అనుమతించమని స్పష్టం చేశారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులలో హాల్ టికెట్‌పై ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు తమ వెంట పెన్సిల్, ఏరాజర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కానీ అనుమతించబడవని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుందని, వ్యవసాయం, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుందని తెలిపారు.



# 100 మంది ఉగ్రవాదులు హాతం

తరువాయి భాగం

పేర్కొన్నారు. డ్రోన్లతో దాడుల సమయంలో పాకిస్థాన్ పౌర విమానాలనూ ఆకాశంలోకి తీసుకువచ్చినట్లు ఏకే భారతి అన్నారు. పాకిస్థాన్ దాడులకు ప్రతి చర్యగా లాహోర్, గుజ్రన్‌వాలా, సర్‌గోదా, రహీర్‌యార్‌ఖాన్ చక్‌లాలా, సకర్, భొలారీ, జకోబాబాద్ స్థావరాలు, రాడార్ సెంటర్లను దెబ్బతీసినట్లు చెప్పారు. పాకిస్థాన్ ఎలాంటి కవ్వింపులకు దిగినా ప్రతి చర్యలకు సంపూర్ణ అధికారాలు మిలిటరీ కమాండర్లకు వచ్చాయని వైస్ అడ్మిరల్ ఏ.ఎన్ ప్రమోద్ స్పష్టంచేశారు. చొరబాటుకు యత్నించిన పాక్ యుద్ధవిమానాలను కూల్చామనీ, వాటి సంఖ్యపై తమ వద్ద స్పష్టమైన సమాచారం ఉందని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఇరుదేశాల డీజీఎంవోల మధ్య చర్చలు ఉంటాయన్నారు. సైన్యం, వాయుసేనలకు మద్దతుగా నిలిచిన భారత నౌకాదళ శక్తికి భయపడే పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించిందని ఏ.ఎన్ ప్రమోద్ వివరించారు.

**కీలక ఉగ్రవాదులు హతం : రాజీవ్ ఘాయ్, డీజీఎంవో లెఫ్టినెంట్ జెనరల్**

ఆ తొమ్మిది ఉగ్రవాద కేంద్రాలపై జరిగిన ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. ఐసీ814 హైజాక్, పుల్వామా పేలుడులో పాల్గొన్న యూసుఫ్ అజార్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ వంటి హైలెవల్ టార్గెట్లు ఉన్నాయి. దాడుల తర్వాత వెంటనే పాకిస్తాన్ నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలకు పాల్పడింది. విచక్షణా రహిత కాల్పుల వల్ల దురదృష్టవశాత్తూ పౌరులు, గ్రామాలు, గురుద్వారా వంటి మత పరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నారు. విషాదకరమైన ప్రాణనష్టం జరిగింది. భారత వైమానిక దళం దాడులలో ప్రధాన పాత్ర పోషించింది. భారత నావికాదళం కచ్చితమైన మందుగుండు సామగ్రిని అందించింది.

**వాళ్ల ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాం - రాజీవ్ ఘాయ్, డీజీఎంవో లెఫ్టినెంట్ జెనరల్**

మే 910 రాత్రి పాకిస్తాన్ సరిహద్దుల వెంబడి మన గగనతలంలోకి డ్రోన్లను పంపింది. ఈసారి ముఖ్యమైన సైనిక మౌలిక సదుపాయాలతో పాటు వాయుస్థావరాలను లక్ష్యంగా చేసుకోవడానికి అనేక విఫలయత్నాలు చేశారు. గగనతల రక్షణ వ్యవస్థలు, వాయుసేన సంయుక్తంగా సమర్థవంతంగా వారి ప్రయత్నాలను భగ్నం చేశాయి. పాకిస్తాన్ నియంత్రణ రేఖపై ఉల్లంఘనలు మళ్లీ ప్రారంభమై తీవ్రమైన యుద్ధ కార్యకలాపాలకు దారితీశాయి. కొన్ని వైమానిక స్థావరాలు, డంప్‌లపై గగనతలం నుంచి పదేపదే దాడులు జరిగాయి. వాటన్నిటినీ అడ్డుకున్నాం. మే 7, 10 మధ్య నియంత్రణ రేఖ వద్ద జరిగిన ఫిరంగి, చిన్న ఆయుధాల కాల్పుల్లో పాకిస్తాన్ సైన్యం సుమారు 35 నుండి 40 మంది సైనికులను కోల్పోయినట్లు తెలిసింది.

**లెక్కించుకోవడం వారి పని : ఏకే భారతి, ఎయిర్ మార్షల్**

ఏ తరహా ఆయుధాలతో దాడులు చేశామనేది నేను చెప్పలేదు. అవి ఆపరేషన్‌కు సంబంధించినవి. నేను వాటి వివరాల్లోకి వెళ్లాలనుకోవట్లేదు. మనం ఎంచుకున్న పద్ధతులు, మార్గాలు ఏవైనా, అవి శత్రు లక్ష్యాలపై కావలసిన ప్రభావాలను చూపాయి. ఎంత ప్రాణనష్టం వాటిల్లింది? ఎంత మందికి గాయాలు అయ్యాయి? మా లక్ష్యం ప్రాణనష్టం కలిగించడం కాదు. ఒకవేళ ప్రాణనష్టం జరిగితే, దానిని లెక్కించడం వారి పని అని నేను అనుకుంటున్నాను.

# ఆపరేషన్ సిందూర్ తో.. పాకిస్తాన్ వణికింది

తరువాయి భాగం

ఆపరేషన్ సిందూర్ చేపట్టి వారికి న్యాయం చేశాయని తెలిపారు.

"దేశం మొత్తం సాయుధ దళాలకు అభినందనలు తెలియజేస్తోంది. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు. దేశ రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక శక్తికి చిహ్నం. ఉగ్రవాదంపై జరిగిన ఈ ఆపరేషన్ దేశ సంకల్ప శక్తిని, సైనిక శక్తి సామర్థ్యాలను కూడా ప్రదర్శించింది. భారతదేశంపై ఉగ్రవాదం రూపంలో ఏదైనా చర్య జరిగినప్పుడల్లా, ఉగ్రవాదులు, వారి నాయకులు ఉన్న ప్రాంతం కూడా సురక్షితంగా ఉండదని మేం చేసి చూపించాం. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల మౌలిక వసతులను కూల్చివేసేందుకే భారత్ సేనలు ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించాయి. మేం వారి పౌరులను ఎప్పుడూ లక్ష్యంగా చేసుకోలేదు. కానీ పాకిస్థాన్ భారత్‌లోని పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడమే కాకుండా దేవాలయాలు, గురుద్వారాలు, చర్చీలపై దాడులకు యత్నించింది. భారతీయ సైన్యం శౌర్యం, ధైర్యంతో పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని తగిన సమాధానం ఇచ్చింది. భారత సైన్యం ప్రతిధ్వని రావల్పిండిలోని పాక్ సైనిక ప్రధాన కార్యాలయం వరకూ వినిపించింది. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదు. ఇది నయా భారత్ అని, సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ఉగ్రవాదంపై ప్రభావవంతమైన చర్యలు తీసుకుంటామని మన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు" అని రాజ్నాథ్ తెలిపారు.

**బ్రహ్మోస్ ఒక గట్టి సందేశం**

బ్రహ్మోస్ కేవలం ఆయుధం కాదని ఒక గట్టి సందేశమని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. లఖ్‌నవూలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన రక్షణమంత్రి, జాతీయ సాంకేతిక దినోత్సవం రోజున బ్రహ్మోస్ యూనిట్ ప్రారంభించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. దేశ రక్షణ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఉత్తర్‌ప్రదేశ్ మారిందన్నారు. కేవలం 40 నెలల్లోనే బ్రహ్మోస్ యూనిట్ పూర్తి కావడం గొప్ప విషయమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

**శక్తి ప్రపంచ దేశాలకు తెలిసింది: యోగి**

మరోవైపు, ఆపరేషన్ సిందూర్‌లో భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఆ సమయంలో క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు.

# స్పెయిన్‌లో డ్రగ్స్ అలవాటు పడ్డాను

విశాలభారతి, స్టేట్ బ్యూరో: హైదరాబాద్‌కు చెందిన డా.నమ్రత చిగురుపాటి భారీ మొత్తంలో కొకెయిన్‌ను డెలివరీ తీసుకుంటూ పోలీసులకు చిక్కడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. రూ.5 లక్షల పెట్టి కొనుగోలు చేసిన డ్రగ్స్‌ను కొరియర్ నుంచి డెలివరీ తీసుకుంటుండగా ఆమె పోలీసులకు దొరికిపోయారు. ఆమెకు డ్రగ్స్ సరఫరా చేసిన ఏజెంట్ బాలకృష్ణను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, కొకెయిన్‌ను సరఫరా చేసిన ప్రధాన నిందితుడు వన్ష్ థక్కర్ మాత్రం పరారీలో ఉన్నాడు. డా. నమ్రతకు ఇద్దరు పిల్లులు. ఆమె భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. షేక్‌పేటలోని ఓ ఖరీదైన అపార్ట్‌మెంట్ లో ఉంటున్నారు. 2014లో పీరమ్‌చెరువులోని ఓ కాలేజీలో ఆమె ఎంబీబీఎస్ చేశారు. ఆ తరువాత 2017లో కొచ్చిలో రేడియేషన్ ఆంకాలజీలో ఎమ్‌డీ పూర్తి చేశారు. 20212022లో స్పెయిన్‌లో ఎమ్‌బీఏ చేశారు. అక్కడ ఉండగానే ఆమెకు డ్రగ్స్ అలవాటయ్యాయి. ఇది వ్యసనంగా మారడంతో ఇండియాకు వచ్చాక కూడా తాను డ్రగ్స్ కొనసాగించానని ఆమె విచారణ సందర్భంగా చెప్పినట్టు సమాచారం. ఇక్కడ స్థానిక డీజేల ద్వారా ఆమె తొలుత డ్రగ్స్ కొనుగోలు చేసేవారు. ఆ తరువాత నమ్రత ఫ్రెండ్ బాయ్‌ఫ్రెండ్ ద్వారా ఆమెకు ముంబైకి చెందిన డ్రగ్స్ కింగ్‌పిన్ వన్ష్ థక్కర్ పరిచయమయ్యాడు. థక్కర్ వద్ద డ్రగ్స్ సరఫరా చేసే కొరియర్‌గా పనిచేసే వాడినని బాలకృష్ణ పోలీసుల విచారణలో తెలిపారు. తనకు కమీషన్ వచ్చేదని అన్నాడు. ''మే 8న హైదరాబాద్‌లో నమ్రత తన కారులో ఉండగా బాలకృష్ణ ఆమెకు కొకెయిన్ ఇచ్చాడు. మరో రూ.10 వేలు అదనంగా తీసుకున్నాడు. ఈ క్రమంలోనే వారిని అరెస్టు చేశాము'' అని రాయదుర్గం పోలీసులు తెలిపారు. ఈ డీల్‌కు సంబంధించిన కీలక ఆధారాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ''ఏడాదిగా థక్కర్ నుంచి ఆమె కొకెయిన్ కొనుగోలు చేస్తోంది. నెలకోసారి డ్రగ్స్ కొంటారు. డ్రగ్స్ డెలివరీ ఎప్పుడు ఎక్కడ చేసేదీ థక్కర్ వాట్సాప్‌లో సూచనలు పంపిస్తాడు. ఈ మెసేజీలు వాతంతట అవే డిలీట్ అయిపోయేలా ఆమె డిస్సపియరింగ్ మెసేజీ ఆప్షన్‌ను ఆన్ చేసి పెట్టుకున్నారు' అని పోలీసులు తెలిపారు. కొకెయిన్‌ను బాలకృష్ణ 57 చిన్న చిన్న ప్యాకెట్లలో సరఫరా చేసినట్టు వివరించారు.

# యుద్ధం వద్దంటే దేశద్రోహులా?

తరువాయి భాగం

మధుసూదన్‌రావు స్ఫూర్తితో భవిష్యత్తుపై నమ్మకంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంతో కలిసి బీవీ రాఘవులు హాజరయ్యారు. ముందుగా మధుసూదన్‌రావు స్మారక స్థూపాన్ని ఆవిష్కరించా రు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అధ్యక్షతన జరిగిన సభలో బీవీ రాఘవులు మాట్లాడారు.ఏప్రిల్ 22 నుంచి పాకిస్తాన్ ఇండియా మధ్య యుద్ధ వాతావరణం చూస్తున్నామన్నారు. పహల్గాంలో పర్యాటకులపై దాడి జరిగినప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారతసైన్యం దాడులు నిర్వహించిందన్నారు. కారణాలు ఏవైనా కాల్పుల విరమణకు ఇరుదేశాలు ఒప్పందం చేసుకున్నాయ ని తెలిపారు. 26 మంది పర్యాటకుల ప్రాణాలను బలితీసుకున్న పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలనీ, అదే పరిష్కారమని అనేక మంది రెచ్చగొట్టారని అన్నారు. కానీ కమ్యూనిస్టులు, కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు మాత్రమే యుద్ధం వద్దన్నాయని తెలిపారు. ఆయా దేశాల జోక్యంతో శాంతియుతం గా దీన్ని పరిష్కరించుకోవాలన్నందుకు కొందరు.. కమ్యూనిస్టులను దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారన్నారు. చివరకు యుద్ధం పరిష్కారం కాదని.. ఒడంబడిక చేసుకోవాల్సి వచ్చిందన్నారు.

# అబద్ధాల కాంగ్రెస్

తరువాయి భాగం

వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జల వనరుల సంఘం, హైడ్రాలజీ అనుమతులున్నా.. ఆ విషయాన్ని మరుగుపరిచిన కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం... సీడబ్ల్యూసీకి డీపీఆర్ సమర్పించిందనీ, 2021లో 113.795 టీఎంసీల నీటి లభ్యతకు ఆమోదం లభించిందని వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు ఆ జిల్లాలోని పరిశ్రమలకు, తాగునీటి కోసం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని తెలిపారు. తమ హయాంలో ఆ ప్రాజెక్టుకు సంబంధించి 90 శాతం పనులను పూర్తి చేస్తే...నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కేసులతో వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నించిందని హరీశ్ వాపోయారు. ఈ అంశాలన్నింటిపై అవగాహన లేని మంత్రి ఉత్తమ్... 'ప్రాజెక్టుకు అనుమతులు లేవు...' అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలోని సాగునీటి విజయాలను కాంగ్రెస్ తన ఘనతగా చెప్పుకోవటం హాస్యాస్పదమని విమర్శించారు.

**సీఎం అహంభావానికి నిదర్శనం...**

ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి విడుదల చేయని విధంగా సీఎం రేవంత్... ఎప్‌సెట్ పరీక్షా ఫలితాలను తన ఇంటి నుంచి విడుదల చేయటం ఆయన అహంభావానికి నిదర్శమని హరీశ్‌రావు మరో ప్రకటనలో పేర్కొన్నా రు. పాలన మీద, విద్యార్థుల మీద ఆయనకున్న చులకన భావానికి ఇది నిదర్శమని విమర్శించారు. ప్రజా పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

# ఇందిరా గాంధీ తప్పిదంతోనే ఈశాన్య అశాంతి

తరువాయి భాగం

ఈశాన్య భారతంలో గడ్డు పరిస్థితిని ఇప్పటికీ అనుభవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పట్లో బంగ్లాదేశ్ ఏర్పాటు దశలో 'భారత్‌కు పాక్ బెడద శాశ్వత స్థాయిలో లేకుండా చేసేందుకు అనువైన పరిస్థితి ఏర్పడింది. అయితే రాజకీయ నాయకత్వ లోపం , ప్రత్యేకించి ఇందిరా గాంధీ పాత్రతో మనం దెబ్బతిన్నామని ఆరోపించారు. ఇప్పుడు భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ , అమెరికా అధ్యక్షుడి మధ్యవర్తిత్వానికి కట్టుబడి పనిచేయడం మోడీ రాజకీయ వైఫల్యం అని కాంగ్రెస్ పూర్తి స్థాయిలో విమర్శలకు దిగుతున్న దశలో అసోం సిఎం నుంచి ఈ ఎదురుదాడి వెలువడింది. అప్పట్లో భారతీయ సైన్యం వీరోచిత పోరు త్యాగాలు , బలిదానం తరువాత బంగ్లాదేశ్ ఏర్పాటు జరిగింది. అయితే ఇప్పుడు బంగ్లాదేశ్ ఏర్పాటు పరిణామం భారత్‌కు ఎటువంటి బెడద , ముప్పునకు దారితీసిందనేది అందరికీ తెలిసిందే అని సిఎం వ్యాఖ్యానించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
12.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## పశుగ్రాసం కోసం 84 గడ్డి కట్టల విరాళం



**విశాలభారతి,భీమదేవరపల్లి :** కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానానికి చెందిన పశువుల పశుగ్రాసం కోసం బాబుపేట వాసి పోతరవేయిన లింగమూర్తి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆయన దేవస్థానానికి అవసరమైన పశుగ్రాసంగా 84 గడ్డి కట్టలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు లింగమూర్తిని అభినందించారు. భక్తిశ్రద్ధలతో చేసిన ఈ దాతృత్వ కార్యం ఇతరులకు స్ఫూర్తిదాయకమని వారు వ్యాఖ్యానించారు.



## ఎప్ సెట్ ఫలితాల్లో జయ విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్రస్థాయిలో 141వ ర్యాంక్ సాధించిన కె.ఉజ్వన్.

**సూర్యాపేట,విశాలభారతి:** ఎప్ సెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయ వేణు గోపాల్ తెలిపారు. ఆదివారం ఆ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎప్ సెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కె.ఉజ్వన్ 141వ ర్యాంక్, జి.తేజశ్రీ 266వ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు సిహెచ్.హన్షిత శ్రీ 695వ ర్యాంక్, టి .అమూల్య 913వ ర్యాంక్, బి.లాస్య 917వ ర్యాంక్, పి.అమిత్ సూర్య 1948, బి.శివమణి 2270, డి జగదీష్‌రాజు 2935, వై.ప్రదీప్ 3364, కె.సాయి నందన్ 3977, జి.నవదీప్ రెడ్డి 4003, సిహెచ్.కుశల్ రాజు 5044, సిహెచ్.అక్షయ భారతి 5583, కె.యామిని 5823, ఎం.హన్సిని 5843, వి.బిందుమాధవి 6002, ఎస్.నక్షత్ర 6630, కె.పవన్ కుమార్ 7280, జి.సాయిరాం 8325, ఆర్.ప్రియదర్శిని 8328, ఎం.సాద్విక 8361, సిహెచ్.వైశాలిని 8449, జె.కీర్తన 8989, ఎ.కిషోర్ 9502వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. మొత్తం 160 మంది ఎంపీసీ విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా వీరిలో 1000లోపు 5గురు, 5 వేల లోపు 11 మంది, 10వేల లోపు 24 మంది, 25 వేల లోపు 53 మంది విద్యార్థులు ర్యాంకులను సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, ఈ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. తమకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచినవిద్యార్థులకు నగదు ప్రోత్సాహం



**ఆర్మూర్, విశాల భారతి.** పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తమ ప్రతిభ కనబరిచిన భాద్గుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం మాజీ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం శర్మ ఒక్కొక్క విద్యార్థికి రూ.1116 అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనబరచడానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేసిన బాద్గుణ, ఉమ్మెడ, మాయాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్ మాజీ సర్పంచ్ పోశెట్టి బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పరి భూమేష్ పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## అమ్మ ప్రేమకు మించిన ప్రేమ లోకంలో ఏదీ లేదు

- రాపర్తి నాగమ్మ ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి శ్రీనివాస్ గౌడ్
- మదర్స్ డే సందర్భంగా ఆర్ఎన్ ఫౌండేషన్ రాపర్తి బేబీ స్టూడియో ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ.

**సూర్యాపేట, విశాలభారతి:** అమ్మ ప్రేమకు మించిన ప్రేమ ఈ లోకంలో ఏదీ లేదు, అమ్మ ప్రేమ లో స్వార్థం ఉండదని రాపర్తి నాగమ్మ ఫౌండేషన్ చైర్మన్, లక్ష్మీ దుర్గ ఫోటో స్టూడియో అధినేత రాపర్తి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా రాపర్తి నాగమ్మ ఫౌండేషన్ రాపర్తి బేబీ స్టూడియో ఆధ్వర్యంలో సూర్యాపేట పాత బస్టాండ్ ఎదురుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ దినోత్సవ సందర్భంగా తమ తల్లిని గుర్తుకు చేసుకుంటూ ఒక మంచి కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరు కూడా సేవా కార్యక్రమంలో పాల్గొంటూ పిల్లలకు సేవా కార్యక్రమంలో ప్రోత్సహిస్తూ ఎలాంటి శుభకార్యం జరిగిన ఆరోజున సహాయం అందిస్తూ ఇతరులకు సేవ చేసే విధంగా అందరూ ఉండాలని మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాపర్తి మన్సూర్ గౌడ్, మాందాస్ అభిరామ్, సాయిరాం, రాపర్తి చరణ్, నందిని, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యార్థిని అభినందించిన నాగుర్ల వెంకన్న

**ఎల్కతుర్తి,విశాలభారతి:** ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన ఆరె కుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు,రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ వారి కుమార్తె హింగే లక్కీకి ఇటీవల ప్రకటించినటువంటి ఎస్ఎస్సి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను 543 మార్కులు వచ్చినందుకు ఆదివారం రోజున తెలంగాణ రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వారి నివాసంలో లక్కీకి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోటె చిరంజీవి, నాయకులు రామారావు, జూపాక భాస్కర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన పుదుచ్చేరి సీఎం

- పర్యావరణ పరిరక్షణ ఏకమవుదాం రండి
- డాక్టర్ సిహెచ్ భద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** పుదుచ్చేరి ముఖ్యమంత్రి సీనియర్ రాజకీయ నాయకులు రంగస్వామి పుదుచ్చేరిలో స్వగృహంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ జీవజాతి సంరక్షణ కోసం మన ప్రపంచ పర్యావరణ సమస్య చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈ రోజులలో ఇటువంటి సమస్యను చూడడం చాలా ఆశ్చర్యంగా ఉందని ఆయన ఆశ్చర్యను వ్యక్తపరిచారు ఈ భూమి మీద జీవజాతిని వృక్షజాతిని మానవజాతిని జంతు జాతిని జీవవైవిద్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చైతన్య పరుస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ ఏకమవుదాం రండి అన్న ఏకైక నినాదంతో పని చేయడం నిజంగా ఎంతో గొప్ప విషయం అన్నారు ఇటువంటి సమస్యతో కలిసి మా ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు భవిష్యత్తులో పుదిచ్చేరి కేంద్ర పాలిత రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణ అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ రికగ్నేషన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ తమ్మినేని సత్యనారాయణ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రతి పాఠశాల విద్యార్థి ప్రపంచ పర్యావరణ సంస్థ చెబుతున్న సూత్రాలను తప్పకుండా పాటించడానికి మీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలని అందుకోసం ప్రతి విద్యార్థి కనీసం తన పాఠశాల విద్య కాలంలో కనీసం 10 మొక్కలు నాటాలని వాటిని పరిరక్షించాలని అన్ని వేదికల మీద పర్యావరణానికి అనుకూలమైన విద్యార్థులను తయారు చేయాలని అందుకు పుదుచ్చేరి ప్రభుత్వం సంపూర్ణ సహయ సహకారాలు అందించాలని పుదుచ్చేరి భారతదేశంలోనే ప్రపంచంలోనే ఎంతో సుందరమైన ప్రదేశం ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు ప్రతి పర్యాటకుడు పర్యాటకురాలు కనీసం ఒక మొక్కను నాటి అందమైన మన పుదిచ్చేరిని నిర్మించాలని అందుకోసం ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ముఖ్యంగా ప్రతి ఒక్కరు ప్రపంచ పర్యావరణ సంస్థ కలిసి నడవాలని కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్ రంగస్వామి గారు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం మన ప్రపంచ పర్యావరణ సంస్థ దేశంలో రాష్ట్రంలో ప్రపంచంలో ఏ సమస్త చేయలేనని కార్యక్రమాలు నిర్వహిస్తూ లక్షలాది మొక్కలు నాటుతూ వేలాది కార్యక్రమాలు టాక్స్ ఫైలింగ్ ఇండియా సంస్థ చైర్మన్ చల్లూరి శ్రీనివాస్ గారి సహకారంతో నిర్వహిస్తూ ప్లాస్టిక్ వ్యతిరేకంగా దాదాపుగా రెండు నుంచి ఐదు లక్షల క్లాస్ బ్యాగులను పంచిపెట్టి ప్రతి విద్యార్థి ప్రతి ఒక్కరు తమ విద్యార్థి దశలో తమ పుట్టినరోజు తమ వివాహ దినోత్సవ వేడుకలలో తమ పూర్వీకులు చనిపోయిన వర్ధంతి దినోత్సవాల్లో మొక్కలని బహుమతులుగా సమర్పించాలని అందుకోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న అన్ని కార్యక్రమాలు నిస్వార్థంగా ప్రతి ఒక్కరు ముందుకు నడిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ పాండిచ్చేరి రాష్ట్ర కోఆర్డినేటర్ సురేష్ గారు తదితరులు పాల్గొని ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు దేశం కోసం భవిష్యత్తు తరాల కోసం భూగోళం సంరక్షణ కోసం జరుగుతున్నాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ గ కోశాధికారి రిజ్వాన్ మరియు సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొని సందర్భంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు



## పూర్వ విద్యార్థుల 20 ఏళ్ల ఆత్మీయ కలయిక

**శాలిగౌరారం, విశాలభారతి:** ఒకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. శాలిగౌరారం మండలం మాధవరం (కాలన్) జడ్పీ హెచ్ ఎస్ హైస్కూల్ లో చదువుకున్న 2005 2006 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం శాలిగౌరారంలోని మాధారం కాలన్ గ్రామంలోని పాఠశాల లో కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనలతో గత 15 రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని సమ్మేళనం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య బోధించిన ఆనాటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరికి ఒకరు ఎవరు వేసుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్నటువంటి వారు తోటి స్నేహితులకు మంచి చెడు అన్నిట్లో ముందంజలో ఉండేలా స్నేహభావాన్ని చాటాలని నిర్ణయించుకున్నారు.

## రాచకొండ రంగయ్య ఆశయ సాధనకై కృషి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి




**సూర్యాపేట,విశాలభారతి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు రాచకొండ రంగయ్య ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సిపిఎం సీనియర్ నాయకులు రాచకొండ రంగయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ ప్రాంతంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రాచకొండ రంగయ్య ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. వెట్టి చాకిరికి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రజలను సాయుదులుగా తయారుచేసి వెట్టి చాకిరి నుండి అనేక మందిని విముక్తి చేశారని అన్నారు. రాచకొండ రంగయ్య తన జీవితాంతం పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేశారని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా కడదాకా ఎర్రజెండా నాయకత్వంలో పని చేశారని అన్నారు. తన జీవితంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని పార్టీని కంటికి రెప్పలా కాపాడడానికి అన్నారు. సూర్యాపేట ప్రాంతంలో సిపిఎం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకటరెడ్డి, వీరబోయిన రవి, మద్దెల జ్యోతి, సిపిఎం జిల్లా నాయకులు ఎం రాంబాబు, చిన్నపంగి నరసయ్య పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**డోర్నకల్, విశాలభారతి:** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని మహబూబాద్ సూర్యపేట 365 జాతీయ రహదారిపై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ సమీపంలో మరిపెడ మండలం బాహోజీ గూడెం గ్రామపంచాయతీలోని భోజ్య తండా, వాగు ఒడ్డు తండా,వెక్కురం తండా యువకులు రాత్రి సమయంలో మరిపెడ బంగ్లాకు వెళ్తుండగా రెండు బైకులు ఢీకొని గుగులోత్ కార్తీక్ (22),భూక్యా సంతోష్ (19) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన అజ్మీరా సుదీర్ (18) చికిత్స పొందుతూ మరోసటి రోజు మృతి చెందారు.. విషయం తెలుసుకున్న డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.జరిగిన ప్రమాదంపై మృతుని కుటుంబ సభ్యులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.అదే రోజు రాత్రి ఇటుక బట్టీలకు రేగాడి మట్టి తోలుతున్న వాహనాలు తగిలి ఉంటాయని అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని మృతుని తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ను కోరారు..ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెల్లి రఘువీరారెడ్డి,కాంగ్రెస్ నాయకులు కాలం రవీందర్ రెడ్డి,బాహోజీ గూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగిజర్ల జగదీష్,గుగులోత్ రాజు,సుధాకర్,లక్ష్మి నారాయణ,వీర భద్రం,బానురుషి,శ్రీను,డాక్టర్ వేంకన్నా,గండి వీరభద్రం,తొట్టి సత్యం ,కాంగ్రెస్ కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మణుగూరు ప్రెస్ క్లబ్ కోశాధికారి జన్మదిన వేడుకలు

**మణుగూరు, విశాలభారతి:** మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పిండిగ వెంకట్ ఆదేశాల మేరకు ప్రెస్ క్లబ్ కోశాధికారి పాషా పుట్టినరోజు వేడుకలు సోమవారం నగరంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు, స్నేహితులు, బంధువులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ పలువురు అతిథులు ప్రసంగించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధిలో ఆయన పాత్రను ప్రశంసిస్తూ, జర్నలిజానికి చేసిన సేవలకు గుర్తుగా శాలువాతో సన్మానించారు.అనంతరం కేక్ కట్ చేసి ఆనందంగా వేడుకను జరుపుకున్నారు. ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆశిస్తూ, శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం, 12.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## గౌడవెల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.



మేడ్చల్, విశాలభారతి;

గౌడవెల్లి ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి 20082009 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.విద్యార్థులు ఉపాధ్యాయులు ఆనాటి మధుర స్మృతులను నెమరేసుకొని, సాధకబాధకాలను పంచుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శేఖర్,శ్రీకాంత్,మల్లికార్జున్, విష్ణు,ఆంజనేయులు,సంతోశ్,ఆనంద్ సన్మానించారు.మళ్లీ కలుద్దాం మిత్రమా' అంటూ ఒక్కరికి ఒక్కరు వీడ్కోలు చెప్పుకున్నారు.



## రాజీవ్ యువ వికాసం పథకంకు సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తి వేయాలి

- తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంతంగి వీరస్వామి గౌడ్.

సూర్యాపేట, విశాలభారతి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఆధారంగానే ఎంపిక చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు, పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని ఖండించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం నుండి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిబిల్ స్కోర్ నిబంధన వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బి సి, మైనారిటీ ఇబీసీలలో ఉన్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6,000 కోట్ల రూపాయలతో 5లక్షల మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయం చేసి దరఖాస్థులు స్వీకరించిందని, ప్రభుత్వ నిర్ణయంతో 16 లక్షల మంది నిరుద్యోగ యువత, నిరుపేదలు, దళితులు గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్థులు స్వీకారణ పూర్తి అయిన తరువాత సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం లబ్ధిదారుల నోట్లో మట్టికోట్టడమే అవుతుందని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి నిరుపేద దళితునికి 12 లక్షల రూపాయలు పూర్తి సబ్సిడీ రూపేనా ఇస్తామని అన్నారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదని, 1లక్ష నుండి 4లక్షల నిబంధనతో పేదల బతుకుల్లో ఇలాంటి మార్పు రాదని అన్నారు. కనీసం 10లక్షలు వరకు నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందిచలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయం వలన పేదలకు ఒక్కరికి కూడా రాజీవ్ యువ వికాసం రుణాలు వచ్చే అవకాశం లేదనీ అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ , జిల్లా గౌర సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్ , జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, అయితే గాని మల్లయ్య గౌడ్, ఖమ్మం పార్టీ అంజయ్య గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, పట్టణ గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, పట్టేటి కిరణ్, లింగారెడ్డి, సారగండ్ల కోటేష్, తదితరులు పాల్గొన్నారు.





# 25 ఏళ్ల స్నేహ బంధాల పునః సంధానం

- 1999-2000 పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం
- హాజరైన నాటి అధ్యాపక బృందం

విశాలభారతి,భీమదేవరపల్లి:

పాఠశాల దశలో ఏర్పడిన స్నేహ బంధాలు కాలానుగుణంగా మరింత బలపడతాయని రుజువు చేస్తూ, 19992000 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ముల్కనూర్‌లోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి దాదాపు 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరై, ఇరవై ఐదు ఏళ్ల అనంతరం మళ్లీ ఒకే చోట చేరి, గడచిన విద్యా సంవత్సరాల జ్ఞాపకాలను తలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బేరె యాదగిరి, చంద్రయ్య హాజరై, విద్యార్థుల ఉత్సాహాన్ని కొనియాడారు. వారు మాట్లాడుతూ, “ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు కేవలం జ్ఞాపకాలే కాక, సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో కూడుకున్నవిగా ఉండాలి” అని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరిగా వేదికపైకి వచ్చి తమ వృత్తిపరమైన ప్రస్థానాన్ని, జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. కొందరు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయికి ఎదగగా, మరికొందరు స్వగ్రామాల్లోనే ప్రజలకు సేవ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా పూర్వ గురువులను గుర్తు చేసుకుంటూ, వారిపై గల కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా పూర్వ ఉపాధ్యాయులను సత్కరించడం జరిగింది. వారిని అభినందిస్తూ స్మృతిచిహ్నాలు బహూకరించగా, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ఎంతో గర్వంగా, ఆనందంగా స్వీకరించారు ఈ వేడుకలో బేరె యాదగిరి, అల్లం నర్సయ్య, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, చంద్రయ్య, ప్రకాష్, ఉమామహేశ్వర్, సిహెచ్ గోపాల్ రెడ్డి, కాశిరెడ్డి ఆదిరెడ్డి, శ్రీలత, హరిప్రియ, పున్నం రవీందర్, పాపయ్య, దామోదర్ విద్యార్థులు హిమసాగర్, వంగ శ్రీధర్, జయప్రకాష్, అనిత, సుజాత, నీలం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

- జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్ వినతి పత్రం అందజేత
- ఎల్ హెచ్ పి ఎస్ (లంబాడి హక్కుల పోరాట సంఘం) రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్.

డోర్నకల్, విశాలభారతి:


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న 107, 110 సర్వే నెంబర్లలో 1.34 గుంటల తో పాటు గ్రీన్ ల్యాండ్, ప్రైవేట్ ల్యాండ్ అక్రమించుకున్న ఓం నారాయణ లోయ పై కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా 1000 కోట్లు విలువగల ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని. ఆదివారం జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్ లంబాడి హక్కుల పోరాట సంఘం ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ బృందం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ గత 4 నెల రోజుల నుండి మహబూబాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని హుస్సేన్ నాయక్ కోరారు. ప్రభుత్వ భూమిని అప్పనంగా దోచుకొని ప్రభుత్వాదాయానికి గండికొడుతూ నెలకు కోట్ల రూపాయలు దండుకుంటున్నాడని తెలిపారు. ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకుని ఆ భూమిలో గురుకులాలు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఓం నారాయణ వెనుకల ఎంత పెద్ద శక్తి ఉన్న వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా ఈ విషయం పై చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని హుస్సేన్ నాయక్ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ నేతలు రాందాస్ నాయక్, శంకర్ నాయక్, భీముడు,నాయక్,మోహన్ నాయక్,

## రైతు మిత్ర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా బరిదుల రాజిరెడ్డి

విశాల భారతి,ఎల్కతుర్తి:



ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో రైతు మిత్ర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా బరిదుల రాజిరెడ్డినీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన రైతు మిత్ర సిల్వర్ జూబ్లీ మహాసభ ఎన్నికలలో ముచ్చటగా మూడవసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై రాజిరెడ్డి హ్యాట్రిక్ సాధించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులందరూ సహకార సమితి నుండి తమ అవసరాలకు అప్పులు తీసుకొని సకాలంలో చెల్లించి సమితి అభివృద్ధికి దోహదపడాలని కోరారు. తమ గెలుపుకు సహకరించిన సభ్యులందరికీఈ సందర్భంగా రాజిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కవంపల్లి మురళి పాలకవర్గ సభ్యులు మంకని చేరాలు, కడారి అనిల్ కడారి సుధాకర్ కడారి లక్ష్మణ్ సాతురి కుమారస్వామి సాతూరి శ్రీకాంత్ గొర్రె కుమారస్వామి చిట్యాల రవి, సమితి గనుకులు గొర్రె అశోక్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనపూర్ గ్రామంలో ఘనంగా మల్లన్న స్వామి జాతర

- కాట శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు

పటాన్ చెరు,విశాలభారతి:

పటాన్‌చెరు మండలంలోని ఘనపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు కాట శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.కార్యక్రమంలోకాంగ్రెస్‌నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శివానందం పాల్గొన్నారు.




## ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం

- కో- ఫౌండర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి




పటాన్ చెరు పట్టణంలోని ఎండీఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో కార్యాలయంలో మాతృదినోత్సవం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోఫౌండర్ పృథ్వీరాజ్, పృథ్వీరాజ్ తల్లి మాదిరి తులసి లక్ష్మి బాలింతలకు అవసరమైన నిత్యవసర వస్తువులతో కూడిన బేబీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఎండీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా మదర్స్ డే ప్రత్యేక కేక్ కట్ చేసి, మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్ పిన్ని ఏలేశ్వరు, కల్పనా, జఖీరా, ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## కీసర పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ

- యుద్ధనికి సంబంధించిన ఫొటోలు,
- వీడియోస్ సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దు.

కీసర ,విశాలభారతి :

కీసర పోలీస్ స్టేషన్లో ఆదివారం కీసర సి ఐ శ్రీనివాస్ పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.యువజన సంఘాల నాయకులు ,మాజీ ప్రజాప్రతినిధులకు భారత్ పాకిస్తాన్ కి యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై పలు సూచనలు చేశారు.ఈ సంధర్భంగా సి ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇష్టను సారంగా యుద్ధం వీడియోస్,ఆర్మీ ఫొటోలు కానీ పోస్టు చేయకూడదు అని అన్నారు.దేశంలో యుద్ధ వాతావరణం ఉన్నందున యువత అంత శాంతి యుతంగా ఉండాలి జెండాలు పట్టుకొని రోడ్లపైకి రావద్దు అని అన్నారు.సోషల్ మీడియాలో యుద్ధానికి సంబంధించిన వీడియోస్ పోస్టు చేయడం వలన మన దగ్గర ఉన్న సమాచారం శత్రు దేశాలకు వెళ్తుంది అని అన్నారు.ఈ పీస్ కమిటీలో పాల్గొన్న మాజీ గ్రామ శాఖ బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో గంజాయికి చాలా యువత బానిసలు అవుతున్నారు ముఖ్యంగా ప్రధాన కూడలిలో అలాగే ఊరు బయట ఉన్న పాన్ షాప్ దుకాణాలు గంజాయికి అడ్డాగా మారాయి అని సి ఐ దృష్టికి తీసుకెళ్లారు.త్వరలోనే పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిపై యువతతో కలిసి అవేర్నెస్ కార్యక్రమం చేపడతాం అలాగే మా క్రైమ్ సిబ్బందిని అలెర్ట్ చేస్తాము అని సి ఐ శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు వెంకటేష్,లక్ష్మణ్,మాజీ ఎంపిటిస్ రమేష్ గుప్తా,మాజీ ఎంపీటీసీ కుమ్మరి ఆంజనేయులు,బిజెపి సీనియర్ నాయకులు మెట్టు కృష్ణ,రాగుల రమేష్,చినింగని కృష్ణ,అన్నబోయిన మహేష్ పాల్గొన్నారు.



## దేశానికి సైనికులే శ్రీరామరక్ష

సికింద్రాబాద్, విశాలభారతి:

దేశానికి సైనికులే శ్రీరామరక్ష, సరిహద్దుల్లో పోరాడుతున్న భారత సైనికులకు విజయం మంచి ఆరోగ్యం కావాలని కోరుతూ ఆదివారం బౌద్ధనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో అంబర్‌నగర్‌లోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి ప్రార్థించడం జరిగింది. స్థానిక అర్చక బృందాలు, ఆధ్యాత్మికులు. నాయకులు. పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో దత్తు, నాగరాజు, కుమార్, సంపత్, ప్రమోద్, సుబ్బారావు, సురేష్, వెంకటేష్, నవీన్, జయంత్, అశోక్, బాలయ్య తదితర డివిజన్ నాయకులు పాల్గొనడం జరిగింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates

# పూజా తదుపరి కర్తవ్యం..?

కెరీర్ లో ఒక రేంజ్ స్టార్ ఫాం కొనసాగించి అతి కొద్దికాలంలోనే ఆ గ్రాఫ్ పడిపోతే ఆ హీరోయిన్ పరిస్థితిని ఊహిస్తేనే అదోలా ఉంటుంది. ఐతే ఎంట్రీ ఇచ్చేప్పుడు స్టార్ అవుతామని ఊహించరు కానీ ఆడియన్స్ లో ఒక గుర్తింపు వచ్చాక అది క్రమ క్రమంగా తగ్గుతూ వస్తే మాత్రం కొంత ఇబ్బంది తప్పదు. ఈ టైం లో అసలు కెరీర్ ఎటు వెళ్తుంది అనే డైలమా స్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం చూస్తుంటే బుట్ట బొమ్మ పూజా హెగ్డే ఈ సిచ్యువేషన్ లోనే ఉన్నట్టు అనిపిస్తుంది. సౌత్ లో అదే మన టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా చేస్తూ వచ్చిన అమ్మడు పాన్ ఇండియా క్రేజ్ కూడా అందుకుంది.తెలుగుతో పాటు తమిళ్ లో కూడా అమ్మడు తన మార్క్ నటనతో సినిమాలు చేస్తూ వస్తుంది. తెలుగులో దాదాపు అందరు స్టార్స్ తో నటించిన పూజా హెగ్డే అలా టాప్ ప్లేస్ కొనసాగుతూనే సడెన్ గా డ్రాప్ అయిపోయింది. అసలు పూజా హెగ్డేకి టాలీవుడ్ ఆఫర్లు ఎందుకు రావట్లేదు అన్న దానికి క్లారిటీ లేదు. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా చేశాక ఆ సినిమా రిజల్ట్ తో మన మేకర్స్ ఆమెను సైడ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. అయినా సరే సూపర్ స్టార్ మహేష్ గుంటూరు కారం సినిమాలో అమ్మడు ఛాన్స్ కొట్టేసింది. ఐతే ఆ సినిమా షూటింగ్ కాస్త లేట్ అవ్వడం ఆ టైం లో తను వేరే సినిమాలకు కమిట్ అవ్వడంతో ఉన్న ఒక్క ఛాన్స్ కాస్త మిస్ అయ్యింది. గుంటూరు కారం నుంచి పూజా హెగ్డే స్కిప్ అవ్వడమే ఆలస్యం ఆమెకు ఒక్కటంటే ఒక్క తెలుగు సినిమా ఆఫర్ రాలేదు. ఐతే హిందీలో సల్మాన్, షాహిద్ లతో సినిమాలు చేసినా అవేవి వర్క్ అవుట్ కాలేదు. తమిళ్ లో కూడా అడపాదడపా అవకాశాలు అందుకుంటుంది పూజా హెగ్డే. ఈ మధ్యనే అమ్మడు సూర్య నటించిన రెట్రో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో పూజా హెగ్డే డీ గ్లామర్ రోల్ పాత్ర పరంగా ఓకే అనిపించినా బుట్ట బొమ్మ ఫ్యాన్స్ మాత్రం డిజప్పాయింట్ అయ్యారు. ఓవరాల్ రిజల్ట్ కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. అందుకే పూజా హెగ్డే నెక్స్ట్ ఏం చేయాలనే కన్ ఫ్యూజన్ లో ఉంది. బాలీవుడ్ లో వరుణ్ ధావన్ తో ఒక సినిమా చేస్తున్న పూజా బేబ్ సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుంది. అక్కడే దళపతి విజయ్ జన నాయగన్ లో కూడా పూజా హెగ్డే నటిస్తుంది.



# సాయి పల్లవి పిసినారితనం చేస్తుందా!

సెలబ్రిటీల ఖర్చులు ఎలా ఉంటాయన్నది చెప్పాల్సిన పనిలేదు. సాధారణ జీవితానికి భిన్నమైన లైఫ్ స్టైల్ వాళ్లది. ఖరీదైన కార్లు... విలాసవంతమైన విల్లా... లగ్జరీ లైఫ్ స్టైల్. వీకెంట్ పార్టీలు..నైట్ పార్టీలంటూ హీరోయిన్ల లైఫ్ వేరుగా ఉంటుంది. అవసరం మేర అదనంగా ప్రయివేట్ సెక్యూరిటీ కూడా నియమించు కుంటారు. కొందరికి రోజుల్లో లక్షల్లో ఖర్చు అవుతుంది. కోట్లలో ఆదాయం వస్తుంటే లక్షల్లో ఖర్చు పెట్టడం పెద్ద కష్టం కాదు.రూపాయి రూపాయి కూడబెట్టి చిక్కం లో దాచే హీరోయిన్లు ఈరోజుల్లో ఎవరుంటారు? అలాంటి నటీమణులు భూతద్దం పెట్టి వెతికినా ఎవరూ కనిపించరు. కానీ నేన ఉన్నానంటూ ముందుకొచ్చింది ఓ పిసినారి హీరోయిన్. అవిడే సాయిపల్లవి. ప్రస్తుతం అమ్మడు క్రేజ్ ఎలా ఉందన్నది చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్..టాలీవుడ్ లో సినిమాలు చేస్తోంది. కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ఇంకా వాణిజ్య ప్రకటనలు చేయడం లేదు. లేదంటే? కంపెనీలు కోట్లు గుమ్మరించడానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ తనకంటూ కొన్ని పరిమితులు విధించేసుకునే సినిమాలు చేస్తుంది. ప్రకటనల జోలికైతే వెళ్లడమే లేదు. ఈ అమ్మడు ఖర్చు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుందిట. రూపాయి ఖర్చు చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుందిట. అక్కడ రూపాయి పెట్టడం వల్ల నాకేంటి? అని ఆలోచిస్తుందిట. ఏదైనా కొనుక్కోవాలన్నా ఆలోచిస్తుందిట. ఇదంతా చిన్నప్పుడు అమ్మ నేర్పిన క్రమశిక్షణ అంటోంది. చిన్నప్పుడు అమ్మను ఏదైనా కవాలని అడిగితే అది అవసరామా? కాదా? అని ఆలోచించి నిర్ణయం తీసుకునేదిట. అసవరం అనుకుంటేనే ఖర్చు చేసేవారుట. కొన్ని సందర్భాల్లో బాధ కలిగినా పెద్దయ్యేకొద్ది ఆలోచిస్తే అమ్మ చేసింది కరెక్టే కదా అని రియలైజ్ అయ్యేదట. ఇప్పుడు తన చేతుల్లో డబ్బు ఉన్నా? అమ్మలాగే ఆలోచించి ఖర్చు చేస్తుందిట పల్లవి. ఆర్థిక క్రమశిక్షణ ప్రతీ ఒక్కరికి చాలా ముఖ్యమని సూచించింది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.